


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 290 ఆదివారం15 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

## మున్సిపాలిటీలను ఆదర్శంగా
# తీర్చిదిద్దుదాం



**మున్సిపల్ ఫలితాలపై పార్టీ నేతలతో సిఎం రేవంత్**

**గెలిపించిన సీనియర్ మంత్రులకు అభినందనలు**

**భద్రాద్రి కొత్తగూడెంపై కుదిరిన అవగాహన**

**మేయర్ సిపిఐకి, డిప్యూటీ మేయర్ కాంగ్రెస్‌కు**

**సిఎం రేవంత్‌తో పల్లా వెంకట్ భేటీలో నిర్ణయం**



హైదరాబాద్/**ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త)::** తెలంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. మనపట్ల ప్రజల నమ్మకం పెరిగేలా అభివృద్ధి సాగాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ చేయడమే కాకుండా.. నిజామాబాద్, కొత్తగూడెం కార్పొరేషన్లలో మేయర్ పీఠాలను కైవసం చేసుకునే వ్యూహాలపై దిశానిర్దేశర చేశారు. మిగతాది 2లో...

## రూ.1,60,504 కోట్ల పనులకు
# కేంద్ర కేబినేట్ ఆమోదం

**అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణం**

**ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటు**



**న్యూఢిల్లీ/ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శనివారం జరగిన కేంద్ర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ.1,60,504 కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. మిగతాది 2లో...

## స్థానిక ఫలితాల ప్రభావం
# అసెంబ్లీ ఎన్నికలపై ఉండదు

**మున్సిపల్ ఎన్నికల్లో**

**మా కార్యకర్తలు వీరోచితంగా పోరాడారు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్/**ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):** మున్సిపల్, గ్రామపంచాయతీలాంటి స్థానిక సంస్థల ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లోకల్ అంశాలు, అధికారంలో ఉన్నవారికే అనుకూలంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసిందని ఆరోపించారు. అదే విధంగా మా పార్టీ కార్యకర్తలు ఈ ఎన్నికల్లో గట్టిగా కొట్లాడారని అన్నారు. గతంలో పార్లమెంట్ ఎన్నికల తర్వాత అడ్డగోలుగా మాట్లాడిన వారికీ ఈ ఎన్నికలే సమాధానమని గుర్తు చేశారు. ఈ ఫలితాలు తమకు అనుకూలంగా ఉన్నాయనిమిగతాది 2లో...

## ఐఏఎస్ అరవింద్ కుమార్
# ప్రాసిక్యూషన్‌కు కేంద్రం ఓకే

**ఇప్పటికే కేటీఆర్ విచారణకు గవర్నర్ గ్రీన్‌సిగల్**

**ఫార్ములా ఈ-కార్ రేసు కేసు చార్జిషీట్‌కు రెడీ అవుతున్న ఏసీబీ**

హైదరాబాద్/**ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) విభాగం రాష్ట్ర ఏసీబీకి అనుమతినిస్తూ సమాచారాన్ని పంపింది. 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్ములా ఈ-కార్ రేసు నిర్వహణకు సంబంధించి విదేశీ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.54.88 కోట్లను బదిలీ చేశారంటూ ఏసీబీలో కేసు నమోదైన విషయం విదితమే. ఆ సమయంలో హెచ్‌ఎండీఏ ప్రత్యేక అధికారిగా ఉన్న ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ తమ సంస్థ ఖాతా నుంచి ఈ డబ్బును విదేశీ కంపెనీకి పంపించడానికిమిగతాది 2లో...




## సవాళ్లు ఎన్నున్నా
# అభివృద్ధికి పెద్దపీట

**బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్**



**రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు**

**రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు**

**మూలధన వ్యయం రూ. 53,915 కోట్లగా అంచనా**

2లో.

## ప్రశ్నిస్తే రక్తం
# చిందించాల్సిందేనా?

**కొట్టింది ఎమ్మెల్యేనా? అనుచరులా?**

**వర్ధన్నపేటలో ప్రజాస్వామ్యంపై సర్జికల్ స్ట్రైక్**

**గెలుపు కిడ్నాప్.. బంజారా యువకులపై బడబాగ్ని**

**రక్తసిక్తమైన జాతీయ రహదారి.. యుద్ధభూమిగా మారిన వరంగల్-ఖమ్మం హైవే**



5లో.

# రైతుభరోసా విడుదలకు రంగం సిద్ధం



2లో.

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

(మొదటి పేజీ తరువాయి)

మంచి ఫలితాలు సాధించారని మంత్రులు, సీనియర్ నేతలను అభినందించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకెళ్లాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఫలితాలను బేరీజు వేసుకుని మరింతగా పార్టీని పటిష్టం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. హంగ్ అసెంబ్లీలు ఉన్నచోట వాటిని దక్కించుకునేలా వ్యూహాత్మకంగా కదలాలని అన్నారు. ఇందులో మంత్రులు, పిసిసి చీఫ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంచి ఫలితాలు వచ్చినా, నిజామాబాద్, కొత్తగూడెంలలో మేయర్ పదవులను దక్కించుకోవడంపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. నిజామాబాద్‌లో మేయర్ పీఠం దక్కించుకునేందుకు ఎంఐఎం పార్టీతో చర్చలు జరపాలని పీసీసీ చీఫ్‌కు సీఎం రేవంత్ సూచించారు. కొత్తగూడెంలో స్వతంత్ర అభ్యర్థులు, ఇతర చిన్న పార్టీల మద్దతు కూడగట్టి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై మంత్రులను, కార్యకర్తలను అభినందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను మా ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి చూపించింది. మా సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకున్న నమ్మకమే ఈ విజయానికి పునాది' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రులందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ స్థాయిలో ఫలితాలు వచ్చాయని ఆయన కొనియాడారు. ఎన్నికల విజయం కేవలం ఆరంభం మాత్రమేనని, అసలైన అభివృద్ధి ఇప్పుడే మొదలవ్వాలని మంత్రులకు సీఎం సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు, మంత్రులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను, సంక్షేమ ఫలాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికలనూ ఎదుర్కోవాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదిలావుంటే సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తాజా పరిణామాలు, కొత్తగూడెం కార్పొరేషన్ గురించి చర్చించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ కూటమి (కాంగ్రెస్-22, సీపీఎం-1) 23 డివిజన్లలో విజయం సాధించింది. సీపీఐకి 22, బీఆర్ఎస్-8, భాజపా-1, స్వతంత్రులు 6 డివిజన్లలో గెలుపొందారు. స్వతంత్రుల్లో ఒకరు సీపీఐ నాయకుడు

కావటంతో ఆ పార్టీ బలం కూడా 23కు చేరింది. మిగిలిన ఐదుగురు స్వతంత్రుల్లో ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారిలో ముగ్గురు హస్తం గూటికి చేరటంతో కాంగ్రెస్ కూటమి బలం 29కు పెరిగింది. అయితే భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఉత్కంఠ వీడింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి సమావేశం కావడంతో ఉత్కంఠకు తెరపడింది. కొత్తగూడెం కార్పొరేషన్ అంశంపై చర్చించిన నేతలిద్దరూ ఓ అంగీకారానికి వచ్చారు. మేయర్ పోస్ట్ సీపీఐకి, డిప్యూటీ మేయర్ పోస్ట్ కాంగ్రెస్ పార్టీకి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో కొత్తగూడెం కార్పొరేషన్ అంశం ఓ కొలిక్కి వచ్చింది. కాగా, ఈ కార్పొరేషన్‌లోని 60 డివిజన్లకు ఈనెల 11న ఎన్నికలు జరగ్గా.. 13న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆర్ఎస్ 8, సీపీఎం 1, బీజేపీ 1, స్వతంత్రులు 6 స్థానాల్లో జయకేతనం ఎగురవేశారు. మరోవైపు కొత్తగూడెం కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ 8 డివిజన్లను సొంతం చేసుకుంది. అయితే, వారంతా కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరిగింది. దీనిపై ఆ 8మంది కార్పొరేటర్లు స్పందించారు. మేయర్ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం చెప్పిందే తమకు శిరోధార్యమంటూ తేల్చి చెప్పారు. పార్టీ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు అమ్ముడు పోయారంటూ చేసే ప్రచారం అవాస్తమంటూ వీడియో విడుదల చేశారు.

# ఐఏఎస్ అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం ఓకే

(మొదటి పేజీ తరువాయి)

అనుమతించారనే ఆరోపణ ఉంది. అయితే ఆ సమయంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ అనుమతి ఇవ్వడం వల్లే తాను ఆ డబ్బును ఫార్ములా ఈ-కార్ రేసుకు సంబంధించిన విదేశీ కంపెనీకి పంపించడానికి ఆమోదం తెలిపినట్టు అరవింద్ కుమార్ ప్రభుత్వ కార్యదర్శికి పంపిన లేఖతో పాటు ఏసీబీ జరిపిన విచారణలోనూ తెలిపారు. దీంతో ఈ కేసులో ప్రధాన నిందితుడిగా కేటీఆర్, రెండో నిందితుడిగా అరవింద్ కుమార్, మూడో నిందితుడిగా హెచ్‌ఎండీఏ సీఈఓ బీఎల్ఎన్ రెడ్డి, నాలుగో నిందితుడిగా విదేశీ కంపెనీని చేరుస్తూ ఏసీబీ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది. అనంతరం ఈ కేసులో పైముగ్గురు నిందితులను ఏసీబీ క్షుణ్ణంగా విచారించింది. ఇక కోర్టులో చార్జిషీటు వేయడానికి ఇప్పటికే ప్రజా ప్రతినిధి అయిన కేటీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి రాష్ట్ర గవర్నర్ అనుమతిని ఏసీబీ తీసుకుంది. ఇక కేంద్రంలోని డీఓపీటీ అధీనంలో ఉండే సివిల్ సర్వీసు అధికారి అయిన అరవింద్ కుమార్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతిని ఇవ్వాలని గత మూడు నెలల క్రితం ఏసీబీ.. ఆ విభాగానికి లేఖ రాసింది. ఎట్టకేలకు అరవింద్ కుమార్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి డీఓపీటీ నుంచి ఏసీబీకీ అనుమతి లభించింది. దీంతో ఈ కేసులో నిందితులపై చార్జిషీటు వేయడానికి డైరెక్టర్ జనరల్ చారు సిన్హా నేతృత్వంలోని ఏసీబీ దర్యాప్తు బృందం నడుం బిగించింది. ఈ వారంలోనే కోర్టులో చార్జిషీటు వేసే అవకాశం ఉందని తెలిసింది. ఈ నేపథ్యంలో కేటీఆర్ తో పాటు ఇతర నిందితులను ఏసీబీ అరెస్ట్ చేస్తుందా అనే ఉత్కంఠ నెలకొంది.

# స్థానిక ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ అనడాన్ని ఆయన ఎద్దేవా చేశారు. ఒక ముఖ్యమంత్రి, జాతీయ అధ్యక్షుడిని తెచ్చి ప్రచారం చేసినా, ఆ పార్టీకి గతంలో కంటే తక్కువ ఓట్లు, వార్డులు వచ్చాయని తెలిపారు. ఎక్స్ అఫీషియో సభ్యులకు సంబంధించిన నిబంధనల విషయంలో ప్రభుత్వానికి కూడా స్పష్టత లేదన్నారు. నిన్నటి దాకా కలెక్టర్లు ఒక మాట, చీఫ్ సెక్రెటరీ ఒక మాట చెప్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న నిబంధనలపై ఎవరికీ స్పష్టత లేదని తెలిపారు. "ఫార్ములా అంశాన్ని ప్రభుత్వం మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నది. ఇప్పటికే నాలుగు సార్లు విచారణ పేరుతో పిలిచి చేసిందేమీ లేదు. మరోసారి తమాషా కోసమే పిలవబోతున్నారు. ఎన్ని సార్లు విచారణ చేసినా మాకేమీ ఇబ్బంది లేదు" అని కేటీఆర్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాలుగు స్థానాలు మాత్రమే గెలిచిందని గుర్తు చేశారు.మున్సిపల్ మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాల ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది. శనివారం ఆపార్టీ జనరల్ సెక్రెటరీ రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలోని లీగల్ సెల్ బందం రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసి వినతి పత్రం అందించింది. ఎన్నికల్లో నిబంధనలు పాటించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

# జాతీయ రహదారిపై విమాన ల్యాండింగ్ సౌకర్యం

### అసోంలో ల్యాండ్ అయిన ప్రధాని మోడీ విమానం



**గౌహత్తి/ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. అస్సాం పర్యటన నిమిత్తం అక్కడకు చేరుకున్నారు. దిబ్రూగఢ్ – మోరాన్ జాతీయ రహదారిపై నిర్మించిన అత్యవసర ల్యాండింగ్ ఫెసిలిటీ రోడ్డుపై మోదీ ప్రయాణించిన ప్రత్యేక విమానం దిగింది. దీంతో అస్సాంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైనట్టయింది. ఆ తర్వాత.. మోదీ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఏర్పాటుచేసిన యుద్ధ, రవాణా, ఎయిర్‌క్రాఫ్ట్‌ల వైమానిక ప్రదర్శనను వీక్షించారు. ఈ ఈఎల్ఎఫ్ గురించి ఎక్స్ వేదికగా ప్రత్యేక పోస్ట్ చేశారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఫెసిలిటీ కీలకం కానుందని పేర్కొన్నారు మోదీ. ఈశాన్య భారతదేశంలో ఏర్పాటుచేసిన ఈ ఎమ్జ్గ్ం÷న్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ(ఇఒఈ).. చైనా సరిహద్దుకు 300 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇటీవల నిర్మించిన 4.2 కిలోమీటర్ల ఈ హైవేపై రఫేల్, సుఖోయ్ వంటి యుద్ధ విమానాలను ల్యాండ్ చేయవచ్చు. అంతేకాకుండా.. అత్యవసర పరిస్థితుల్లో సైనిక, పౌర విమానాలను దింపేందుకూ ఇది ఉపయుక్తం కానుంది. దిబ్రూగఢ్ ఎయిర్‌పోర్ట్, చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్లలో కార్యకలాపాలు నిర్వహించలేని సందర్భాల్లో దీనిని ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవచ్చు.దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ఏమైనా ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు.. భారత వాయుసేన వేగంగా స్పందించేందుకూ మార్గం సుగమం కానుంది. టేకాఫ్, ల్యాండింగ్ రెండింటికీ అనుకూలంగా ఈ ఫెసిలిటీని డిజైన్ చేశారు. పశ్చిమ, ఉత్తర, మధ్య భారతంలో ఇప్పటికే ఈ ఈఎల్ఎఫ్‌లు ఉన్నాయి.

# రైతుభరోసా విడుదలకు రంగం సిద్ధం

**హైదరాబాద్/ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు శుభవార్త చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా నిర్ణయం చేసినట్లు తెలుస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సిఎం రేవతం చర్చించే అవకాశం ఉంది. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రచిస్తోంది.




# రూ.1,60,504 కోట్ల పనులకు కేంద్ర కేబినేట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోహుపూర్-నుమాలిఘర్ మధ్య అండర్ వాటర్ రోడ్డు టన్నెల్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. 34 కిలోమీటర్ల మేర అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ టన్నెల్ నిర్మాణంతో 250 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా 6 గంటల సమయం పట్టే గమ్యస్థానాన్ని కేవలం 20 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉంది. బ్రహ్మపుత్ర నది కింద రైల్వేలైన్, నేషనల్ హైవే కోసం టన్నెల్‌ని నిర్మించనుంది. అలాగే కసారా-మన్మాడ్ మూడు, నాలుగో రైల్వేలైన్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బళ్లారి-హోస్పేట మధ్య రూ.2,372 కోట్లతో 3, 4 రైల్వేలైన్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. గూడె బెల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ.3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్ , నారాయణపేట, రాయచూర్, దేవరకద్ర, హైదరాబాద్‌కు ఈ కనెక్టివిటీ ఉంది. హైదరాబాద్-పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3175 కోట్ల ఖర్చు చేయనుంది. దమాసియా-బిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి రూ.4,584 కోట్లను ఖర్చు చేయనుంది. గోతి- త్రిమ్బక్ - పాల్గర్ సెక్షన్ అబ్రిడేషన్ కోసం రూ.3320 కోట్లని కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

# సవాళ్లు ఎన్నున్నా అభివృద్ధికి పెద్దపీట

**అమరావతి/ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):**

2026-27కు సంబంధించిన వార్షిక బ్జడెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.3,32,205 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు ఏపీ అసెంబ్లీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పం లాంటిదని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. వరుసగా మూడోసారి ఆయన బడ్జెట్‌ని ప్రవేశ పెట్టారు. ఒకసారి ఒటాన్ అకౌంట్ బడ్జెట్.. రెండు సార్లు పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన పయ్యావుల.. రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు, మూలధన వ్యయం రూ. 53,915 కోట్లుగా అంచనా వేశారు. రెవెన్యూ లోటు రూ. 22,002 కోట్లు, ద్రవ్య లోటు రూ. 75,868 కోట్లుగా అంచనా వేశారు. అయితే, రాష్ట్ర రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గింది అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. 2025- 26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 41, 118.36 కోట్లుకు చేరింది. 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 22, 002.50 కోట్లు ఉంది. 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రూ. 80,567.47 కోట్ల ద్రవ్య లోటుగా నమోదు అయింది. ఇక, 2026-27బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ. 75,868.09 కోట్లుగా ఉండొచ్చని అంచనా.

2026-27 వార్షిక బ్జడెట్: రూ.3,32,205 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం: రూ.2,56,143 కోట్లు,మూలధన వ్యయం: రూ.53,915 కోట్లు,రెవెన్యూ లోటు: రూ.22,002 కోట్లు,ద్రవ్య లోటు: రూ.75,868 కోట్లుగా చూపారు. ప్రధానంగా రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు, రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు, 'వీబీ జీ రామ్ జీ'కి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.5,451 కోట్లు, పరిశ్రమలకు రూ.3,161 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సర్దుబాటు నిధి రూ.1,500 కోట్లు, స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు, జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు కేటాయించారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు, పోలవరం రూ.6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన



రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు. సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు కేటాయింపులు పరిశీలిస్తే ...ఎన్టీఆర్ భరోసా - రూ.27,719 కోట్లు,దీపం 2.0 - రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతు - రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి - రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ - రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో - రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు

స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు,ఉపకార వేతనాలు రూ.3,836 కోట్లు ,మగ్ర శిక్ష రూ.2,946 కోట్లుఉన్నత విద్య రూ.2,566 కోట్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం- రూ.2,161 కోట్లు ,మనబడి మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి కిరూ.1,232 కోట్లు,పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకు రూ.654 కోట్లు, యువత, క్రీడలు రూ.438 కోట్లుకేటాయించారు. శాఖల వారిగా బ్జడెట్ కేటాయింపులు పరిశీలిస్తే... వ్యవసాయ అనుబంధ రంగాలు - రూ.13,598 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ - రూ.22,942 కోట్లు, మున్సిపల్ శాఖ - రూ.14,539 కోట్లు

జలవనరుల శాఖ - రూ.18, 224 కోట్లు, పాఠశాల విద్యాశాఖ - రూ.32,308 కోట్లు, ఇంధన శాఖ - రూ.13,934 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖ - రూ.11,118 కోట్లు, కార్మిక శాఖ - రూ.735 కోట్లు, గృహ నిర్మాణ శాఖ - రూ.6357 కోట్లు, రోడ్లు, భవన నిర్మాణాల శాఖ - రూ.9,856 కోట్లు, హోం శాఖ - రూ.9,165కోట్లు కేటాయించారు. ఇక ఇతర కేటాయింపులు పరిశీలిస్తే ..పోలీస్ శాఖకు 3 వేల కొత్త వాహనాలుకొత్త పోలీస్ అకాడమీ కోసం 94 ఎకరాలు,ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు,జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు,స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు,విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ.28,000 కోట్లు,రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రూ.30,000 కోట్లు, కేటాయించారు. వరుసగా మూడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం తన అదృష్టమని అన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యానికి అనుగుణంగా బ్జడెట్ రూపొందించినట్లు తెలిపారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాయలసీమ రైతుల కలలను సాకారం చేసేది బడ్జెట్ అన్నారు. కుటుంబాన్ని నడిపిస్తున్న గృహిణికి భరోసా ఇచ్చేది బడ్జెట్ అని చెప్పుకొచ్చారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండిలో పరుగులు పెట్టించాలనే సంకల్పం తమది అని స్పష్టం చేశారు. బ్రాండ్ చంద్రబాబు వల్లే స్వర్ణాంధ్ర సాకారమన్నారు ఆర్థిక మంత్రి . గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం చేసుకుంది బాహుబలి ఒప్పందమని తెలిపారు. రైతుల కలలను నెరవేర్చేలా, యువతకు ఉద్యోగవకాశాలు కల్పించేలా, తన బిడ్డలను చక్కగా పెంచాలనే తల్లికి భరోసా ఇచ్చేలా బడ్జెట్ ఉందన్నారు. పాలన ఎలా చేయకూడదో అనేది గత ప్రభుత్వ రాష్ట్రానికి చేసిన నష్టాన్ని చూస్తే అర్థమవుతుందని తెలిపారు . గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దేలా 2024లో బడ్జెట్ ప్రవేశపెడితే... స్వర్ణాంధ్ర విజన్-2047కు బాటలు వేస్తూ 2025లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టామని చెప్పారు. ఆర్థిక విధ్వంసం ఎదుర్కొన్న రాష్ట్రాన్ని సరిదిద్దడానికి రెండేళ్ల సమయం ఎంత మాత్రమూ సరిపోదని మంత్రి చెప్పారు. ÷ూష్ట్రానికి విభజనతో జరిగిన నష్టంతో పాటు... గత ప్రభుత్వ పాలన కూడా తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు మంత్రి. చాలా సవాళ్లు ఉన్నా రాష్ట్రం చెప్పుకోదగ్గ స్థాయిలో అభివృద్ధి జరిగిందని చెప్పడానికి గర్వపడుతున్నానని అన్నారు. ఇప్పటి వరకు ఏం సాధించాం... ఇంకా ఏం సాధించాలనే అంశాల ఆధారంగా బ్జడెట్ రూపొందించామని మంత్రి తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ బడ్జెట్‌ను తీర్చిదిద్దామన్నారు. కాగితాలకే పరిమితం కాకుండా... క్షేత్ర స్థాయిలో సంక్షేమాన్ని అమలు చేయడమే లక్ష్యంగాబడ్జెట్ రూపొందించామని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

# ధర్మసాగర్‌లో స్వీయ పాలన దినోత్సవం ఘనంగా

## విద్యార్థుల్లో నాయకత్వ స్ఫూర్తి వెల్లివిరిసింది

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి13 (జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ స్ బాలుర పాఠశాల ధర్మసాగర్లో స్వీయ పాలన దినోత్సవాన్ని శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థులే పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వీకరించి ఒకరోజు పాటు పూర్తిస్థాయిలో పాఠశాలను నడిపించడం విశేషంగా నిలిచింది.

ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థులు ప్రధానోపాధ్యాయుని పాత్రను, మరికొందరు ఉపాధ్యాయుల బాధ్యతలను, ఇంకొందరు వివిధ విద్యార్థి సంఘాల సమన్వయ బాధ్యతలను స్వీకరించారు. ఉదయం ప్రార్థన సభను నిర్వహించడం, హాజరు నమోదు చేయడం, తరగతుల్లో పాఠాలను బోధించడం, క్రమశిక్షణను పర్యవేక్షించడం వంటి అన్ని కార్యక్రమాలను చక్కగా నిర్వహించారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసం, సమయపాలన, క్రమబద్ధత అందరినీ ఆకట్టుకుంది.

స్వీయ పాలన దినోత్సవం నిర్వహణ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, బాధ్యతాభావాన్ని బలపరచడం, నిర్ణయ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, ప్రజాస్వామ్య విలువల పట్ల అవగాహన కల్పించడం అని పాఠశాల వర్గాలు తెలిపారు. భవిష్యత్తులో సమాజంలో సమర్థులైన పౌరులుగా



ఎదగడానికి ఇలాంటి అనుభవాలు ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు.

విద్యార్థిఉపాధ్యాయుల సమీక్ష సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు ధర్మ ప్రకాష్ మాట్లాడుతూ, పాఠశాల నిర్వహణ ఎంత బాధ్యతతో కూడుకున్నదో విద్యార్థులు ప్రత్యక్షంగా అనుభవించారని తెలిపారు. బోధనలో స్పష్టత, సహచరులతో సహకారం, జట్టు భావన, పరస్పర గౌరవం వంటి విలువలు ఈ కార్యక్రమం ద్వారా మరింత బలపడినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమాన్ని గణిత ఉపాధ్యాయురాలు కిరణ్మయి సమన్వయం చేశారు. విద్యార్థుల బోధనా విధానాన్ని



పరిశీలించి అభిప్రాయాలు తెలిపిన న్యాయనిర్ణేతల మండలి సభ్యులు సురేష్, రాజమ్మ, రామకృష్ణ విద్యార్థులు ప్రదర్శించిన నిష్ఠ, పట్టుదల, సమన్వయ నైపుణ్యాలను ప్రశంసించారు. పాఠ్యాంశాల వివరణలో స్పష్టతతో పాటు క్రమశిక్షణ పరిరక్షణలో చూపిన చురుకుదనాన్ని అభినందించారు.

స్వీయ పాలన దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రాంగణం విద్యార్థుల చురుకుదనంతో కళకళలాడింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే మంచి నాయకులుగా ఎదగాలనే సంకల్పాన్ని బలపరిచిందని ఉపాధ్యాయులు తెలిపారు.

# త్వరలో ముల్కనూరులో మెగా ఉచిత వైద్య శిబిరం

## జిల్లా వైద్యాధికారి అప్పయ్య





**భీమదేవరపల్లి/ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో త్వరలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వైద్యాధికారి (డి.ఎం.హెచ్.ఓ) అప్పయ్య తెలిపారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శనివారం ముల్కనూరులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. స్వాతంత్ర సమరయోధుల భవనం మరియు దాని పరిసర ప్రాంతాల్లో శిబిరం నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు, వైద్య సేవల ఏర్పాట్లు, రోగుల నమోదు, మందుల పంపిణీ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, ముల్కనూర్, వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ రెహమాన్, డాక్టర్ రాజశేఖర్, రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రెస్ కొమురయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు గజ్జెల రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు జక్కుల అనిల్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి పోగుల శ్రీకాంత్, సీనియర్ నాయకులు ఊసకోయల ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసగోని బాలకృష్ణ, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# తిర్మలాయపల్లిలో మహాశివరాత్రి వేడుకలకు విరాళం

## భక్తి భావంతో ఉత్సవాలు నిర్వహించాలని పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పిలుపు

**రాయపర్తి/ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని తిర్మలాయపల్లి గ్రామంలో మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలకు ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 21 వేల రూపాయల విరాళాన్ని ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు.



ఈ సందర్భంగా ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, బి ఆర్ ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి వేడుకలను భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. పర్వదినం సందర్భంగా గ్రామస్థులు ఐక్యంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. దేవాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు జినుగు అనిమిరెడ్డి, సర్పంచ్ బరిగెల బాబు, మాజీ సర్పంచ్ గజవెల్లి అనంతప్రసాద్, ఉప సర్పంచ్ బక్క ఎల్లయ్య, కుక్కల భాస్కర్, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, సొమెందర్, గజవెల్లి రాజు, గజవెల్లి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిజికల్ సైన్స్ ప్రతిభా పరీక్షలో కొండూరు విద్యార్థుల సత్తా

**రాయపర్తి/ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):** మండల స్థాయి భౌతిక శాస్త్ర వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో కొండూరు గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. క్రమశిక్షణ, కృషితో ముందంజ వేసిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించడం పాఠశాలకు గౌరవాన్ని తీసుకొచ్చింది. పరీక్ష ఫలితాల్లో కొమ్ము



శిరీష ప్రథమ స్థానం సాధించగా, మండల శ్రావ్య ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. మండలంలోని మైలారం పాఠశాల విద్యార్థి సి.హెచ్. సుహాస్ రాజ్ తృతీయ స్థానం పొందారు. విజేతల ప్రతిభపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో మండల విద్యాధికారి వెన్నంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనకు కష్టపడి చదవాలని, శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలు సాధించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గారె కృష్ణమూర్తి, గాదె ప్రవీణ్ రెడ్డి, కటకం రఘు, శంకర్, యాకయ్య, వీరాస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అన్నారుగూడెంబిల్లుపాడు మధ్య రహదారి దెబ్బతింది

## తక్షణమే మరమ్మతులు చేయాలంటూ గ్రామస్తుల విజ్ఞప్తి



**తల్లాడ/ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండలంలోని అన్నారుగూడెం బిల్లుపాడు గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి గుంతలతో పూర్తిగా దెబ్బతిని వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారి అంతటా లోతైన గుంతలు ఏర్పడటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

ప్రత్యేకించి రాత్రి వేళల్లో గుంతలు స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఇటీవల పలుచోట్ల చిన్నపాటి ప్రమాదాలు జరిగినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. రెండు గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు ప్రతిరోజూ ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తుండటంతో సమస్య మరింత తీవ్రమైంది.


పంట ఉత్పత్తులను తరలించడంలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లే వారికి కూడా ఈ రహదారి ఇబ్బందికరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారిలోని గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదాలు మరింత పెరగకముందే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రాయగూడెం లో మహాశివరాత్రి మహోత్సవాలకు వైభవ సన్నాహాలు

## ఈనెల 15న లింగోద్భవ కాలంలో విశేష అభిషేకాలు రుద్రహోమం, కళ్యాణోత్సవం ప్రధాన ఆకర్షణలు

**ధర్మసాగర్, హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని రాయగూడెం మరియుచిన్న పెండ్యాల చిల్పూర్ గుట్ట సమీపంలో ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతి సహిత సోమలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలను ఈనెల 15వ తేదీ (ఆదివారం) ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థాన నిర్వాహకులు వెల్లడించారు. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా వేలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున విస్తృత సన్నాహాలు చేపట్టినట్లు తెలిపారు.







**లింగోద్భవ కాలంలో విశేష పూజలు**

మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ కాలంలో స్వామివారికి విశేష అభిషేకాలు, రుద్రాభిషేకం, రుద్రహోమం, ప్రత్యేక అర్చనలు నిర్వహించనున్నారు. శివనామ స్మరణ, వేదమంత్రోచ్చారణల మధ్య జరిగే ఈ పూజలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తాయని పురోహితులు తెలిపారు.

**ఉదయం నుంచే భక్తుల రద్దీ**

ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, తేనె, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు స్వామివారి ఆరగింపు అనంతరం తీర్థప్రసాద వితరణ చేపడతారు.

**మధ్యాహ్నం రుద్రహోమం**

మధ్యాహ్నం రుద్రహోమ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. 12:30 గంటలకు స్వామివారి ఆరగింపు, తీర్థప్రసాద వితరణ ఉంటుంది. అనంతరం భక్తుల కోరికల మేరకు ప్రత్యేక అభిషేకాలు కొనసాగుతాయి.

**సాయంత్రం కల్యాణ మహోత్సవం**

సాయంత్రం 6:30 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. శివపార్వతుల దివ్య కళ్యాణాన్ని దర్శించుకోవడం ద్వారా కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యాలు కలుగుతాయని విశ్వాసం. ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

**భక్తులకు పిలుపు**

లింగోద్భవ మహిమాన్విత సమయంలో జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని దేవస్థాన కమిటీ సభ్యులు భక్తులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాలను రామగిరి సోమలింగం ఆచార్య, ధర్మపత్నీ సోమలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# హస్తంకు సొంత కోవర్టు ల పోటు


## వర్ధన్నపేట మున్సిపాలిటీలో కలుపు రాజకీయం

## అధిష్టానం కళ్ళు గప్పి ప్రత్యర్థులతో చేతులు కలిపిన నేతలు? -పదేళ్ల కష్టం బుగ్గిపాలు.. కార్యకర్తల ఆవేదన

**వర్ధన్నపేట/ఫిబ్రవరి14(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం వీస్తున్నా, వర్ధన్నపేట గడ్డపై మాత్రం హస్తం పార్టీకి సొంత నేతలే శని లా దాపురించారు. మున్సిపల్ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ సాధించే అవకాశం ఉన్నా, కొందరు స్వార్థపరుల అంతర్గత కుతంత్రాల వల్ల పార్టీ కుదేలైంది. పదవులు అనుభవించడానికి కాంగ్రెస్ కండువా. పనులు చేయడానికి పరాయి పార్టీ అజెండా అన్నట్లుగా వ్యవహరిస్తున్న కోవర్టు నేతల తీరుపై కార్యకర్తలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. ఫలితాల్లో హంగ్ ఏర్పడటం, బిఆర్ఎస్ ఆరు స్థానాలతో పైచేయి సాధించడం వెనుక పార్టీలోని కలుపు మొక్కల హస్తం ఉందనేది బహిరంగ రహస్యమే.

**ఎముకలు కొరికే చలిలో జెండా పడితే.. పదవుల వేళ వెన్నుపోటు..**

గత పదేళ్ల కష్టకాలంలో, అధికారం ఆమడ దూరంలో ఉన్నప్పుడు లాఠీ దెబ్బలు తిని పార్టీని కాపాడుకున్న అసలైన కార్యకర్తలు నేడు కన్నీరు పెడుతున్నారు. ఎన్నికల వేళ టిక్కెట్ల పంపిణీ నుంచి ప్రచారం వరకు ప్రతిచోటా స్వార్థపరులదే రాజ్యమైంది. నిస్వార్థంగా పనిచేసే వారిని తొక్కేస్తూ, ప్రత్యర్థి పార్టీలతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్న వారికి పీట వేయడం వల్లే వర్ధన్నపేటలో



కాంగ్రెస్ అభాసుపాలైందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ స్వార్థ రాజకీయం వల్లే చైర్మన్ పీఠం దక్కాల్సిన చోట, ఇప్పుడు కిడ్నాప్ రాజకీయాలు, ఉద్రిక్తతలకు దారితీసింది.

**కలుపు మొక్కలను ఏరేసేది ఎప్పుడు?**

పార్టీ ముసుగులో ఉంటూ సొంత అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా పనిచేసిన ఆ నల్ల గొర్రెలను గుర్తించి ఏరివేయకపోతే రానున్న రోజుల్లో పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. మేము రక్తం ధారపోసి చెట్టును పెంచితే, ఇప్పుడు వచ్చిన వారు పండ్ల కోసం చెట్టునే నరికేస్తున్నారఅని ఒక సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. అధినాయకత్వం ఇప్పటికైనా అప్రమత్తం కాకపోతే, పదేళ్ల నాటి చీకటి రోజులను కార్యకర్తలు మళ్ళీ అనుభవించాల్సి వస్తుంది.

**అధిష్టానం మేల్కోకుంటే మునిగిపోవడం ఖాయం..**

వర్ధన్నపేటలో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై రాష్ట్ర నాయకత్వం తక్షణమే దృష్టి సారించాలి.
పార్టీ సిద్ధాంతాలకు తూట్లు పొడిచే వారిని తక్షణమే బహిష్కరించాలి. పదవుల కోసం పాకులాడే కోవర్టులను కాకుండా, పార్టీ కోసం పనిచేసే నిస్వార్థ సేవకులను గుర్తించాలి. గందరగోళానికి గురైన కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపేలా రాష్ట్ర స్థాయి నాయకులు జోక్యం చేసుకోవాలి. రానున్న ఎన్నికల నాటికైనా ఈ కలుపు మొక్కల ను ఏరివేసి, పార్టీని ప్రక్షాళన చేయకపోతే వర్ధన్నపేటలో కాంగ్రెస్ అస్తిత్వం మంటగలవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పార్టీ మనుగడ కోరుకునే ప్రతి కార్యకర్త ఇప్పుడు అధిష్టానం తీసుకునే కఠిన నిర్ణయాల కోసం వేచి చూస్తున్నారు.

# బయ్యారంలో చందన హోమియో క్లినిక్ ప్రారంభం.







**బయ్యారం/ఫిబ్రవరి 14( జర్నలిస్ట్ వార్త):**
బయ్యారం మండల కేంద్రంలో బయ్యారం వీరన్న స్వగృహంలో చందన హోమియో క్లినిక్ ని రిటైడు ప్రధానోపాధ్యాయులు తిరుమల వెంకట రెడ్డి శనివారం అత్యంత వైభావంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్,డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి,తిరుమల ప్రభాకర్ రెడ్డి,సూరం సుధాకర్ రెడ్డి,వేం యాకుబ్ రెడ్డి,లింగరాజు, రామగిరి బిక్షం,వెంకట రెడ్డి,వీరారెడ్డి, సంపత్ యాదవ్, భూషయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి మాట్లాడుతూ హోమియోపతి అనేది గొప్ప వైద్య విధానం అని పేదవాళ్లు,కార్మికులు తక్కువ ఖర్చుతో విలువైన వైద్యాన్ని పొందవచ్చన్నారు.బయ్యారంలో మొదటి సారిగా హోమియోపతి వైద్య సేవలు ప్రారంభించడం సంతోషదాయకం అని సర్పంచ్ శాంతి అన్నారు.డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా శాస్త్రీయమైన వైద్య విధానం హోమియోపతి అని అన్నారు.పేద ప్రజలకు అందుబాటులో ఉంటుందని అందరూ ఈ సేవలు ఉపయోగించుకోవాలని వారు సూచించారు.డాక్టర్ చందనవినయ్ మాట్లాడుతూ తాత్కాలిక జబ్బులకు హోమియోపతి మందులు వాడటం వల్ల దీర్ఘకాలిక జబ్బులు వచ్చే అవకాశం ఉండదని తెలిపారు.మందులు కూడా తక్కువ ధరల్లో లభిస్తాయన్నారు .వీటిని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరబోయిన సంపత్ యాదవ్,వీరన్న, చంటి,పాండవుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీకి పట్టాభిషేకం
## - ప్రజా యోధుడికి గౌరవ వందనం!

### గౌరవ డాక్టరేట్ అందుకున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

**భద్రాద్రి కొత్తగూడెం/ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త)**
ప్రజలే ప్రాణంగా, ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజా నాయకుడు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య గారికి అరుదైన గౌరవం దక్కింది. చెన్నైలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై సాగించిన పోరాటాలకు ఇది ప్రతిష్టాత్మక గుర్తింపుగా భావిస్తున్నారు.ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభలో ప్రజల వాణిగా నిలిచిన నరసయ్య గారు, పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యే జీవించడం తన ధ్యేయంగా ఎంచుకున్నారు. పేదలు, గిరిజనులు, కార్మికుల హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజా సమస్యలపై తన గళం ఎప్పుడూ నిస్సందేహంగా వినిపించారు.“పదవులు రావచ్చుడ పోవచ్చుడ కానీ ప్రజల గుండెల్లో సంపాదించుకున్న స్థానం శాశ్వతం” అన్నది ఆయన జీవన విధానం. సాధారణ రైతులా,



సామాన్య ప్రయాణికుడిలా జీవిస్తూ నిరాడంబరతకు నిలువుటద్దంగా నిలిచారు. రాజకీయాల్లో స్వచ్ఛత, నిజాయితీ సాధ్యమేనని ఆయన జీవితం నిరూపించింది.ప్రజా పోరాటాల యోధుడిగా పేరుగాంచిన ఆయనకు గౌరవ డాక్టరేట్ లభించడం జిల్లా ప్రజల్లో ఆనందోత్సాహాలు నింపింది. వివిధ రాజకీయ, సామాజిక వర్గాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు. ఈ గౌరవం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకే కాక రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు.
ప్రజా సేవకు అంకితభావంతో నడిచిన నాయకుడికి లభించిన ఈ గుర్తింపు యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజల మధ్యే ఉండి ప్రజల కోసం పోరాడిన నాయకుడికి అందిన ఈ గౌరవం, ఆ పురస్కారానికే మరింత గౌరవం తెచ్చిందని విశ్లేషకులు వ్యాఖ్యానించారు.
ప్రియతమ నాయకుడికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

# మహాశివరాత్రి మహిమ
# భక్తి జాగరణకు మహా పర్వం

### మాఘమాసం కృష్ణ పక్ష చతుర్దశిడ శివనామ స్మరణతో మారుమోగే రాత్రి

భక్తిశ్రద్ధలతో ఆలయాలు కళకళలాడే పుణ్యక్షణండ ఇదే మహాశివరాత్రి. “శివుని మహా రాత్రి”గా పేరుగాంచిన ఈ పర్వదినం హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదిగా భావించబడుతుంది. ఉపవాస దీక్షలు, రాత్రంతా జాగరణ, అభిషేకాలు, భజనలుఈ అన్ని ఆచారాల సమ్మేళనమే మహాశివరాత్రి. శివతత్వం సృష్టి, స్థితి, లయల సమన్వయం
త్రిమూర్తుల్లో లయకర్తగా పూజింపబడే పరమేశ్వరుడు భక్తులకు భోళెనాథుడు. గంగాధరుడు, నీలకంఠుడు, శంభో అంటూ అనేక నామాలతో స్మరించబడే శివుడు త్యాగానికి, శాంతికి, సమానత్వానికి ప్రతీక. శివతత్వం అనేది శూన్యతకు, అహంకార విముక్తికి సంకేతం. భౌతిక కోరికలను అధిగమించి ఆత్మజ్ఞాన మార్గంలో నడవమని శివుడు బోధిస్తాడు.
పురాణాల ప్రకారం ఈ రోజునే శివుడు లింగరూపంలో అవతరించాడని విశ్వసిస్తారు. మరికొన్ని కథనాలు ఈ రోజే శివపార్వతుల కల్యాణం జరిగినదని చెబుతాయి. అందుకే ఈ పర్వదినానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఏర్పడింది.

**ఆలయాల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం**

మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించబడతాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు దర్శనం కోసం క్యూలైన్లలో నిలబడతారు. లింగాభిషేకాలు, రుద్రాభిషేకాలు, హోమాలు ఘనంగా నిర్వహిస్తారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెరలతో పంచామృతాభిషేకం చేయడం విశేషం.
బిల్వదళ సమర్పణ శివార్చనలో ప్రధానమైన ఆచారం. “ఓం నమః శివాయ” అనే పంచాక్షరి మంత్రం ఆలయాల్లో మారుమోగుతుంది. రాత్రంతా భజనలు, కీర్తనలు, శివతాండవ స్తోత్ర పఠనంతో భక్తులు జాగరణ చేస్తారు.

**జాగరణ అజ్ఞానంపై జ్ఞాన విజయం**

మహాశివరాత్రి జాగరణ కేవలం నిద్రలేకుండా గడిపే రాత్రి కాదు. అది ఆత్మపరిశీలనకు, ఆధ్యాత్మిక చైతన్యానికి



సంకేతం. ఉపవాసం శరీర శుద్ధికి, జపం మనశ్శాంతికి, ధ్యానం ఆత్మశుద్ధికి దోహదం చేస్తాయని శాస్త్రాలు పేర్కొంటాయి. అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానదీపాన్ని వెలిగించే మహా అవకాశం ఇదే.

**పురాణాల్లో భక్తి ప్రాముఖ్యం**

ఒక వేటగాడు తెలియకుండానే శివరాత్రి రోజున ఉపవాసం చేసి, రాత్రంతా జాగరించి బిల్వదళాలు కింద పడవేసిన కథ ప్రసిద్ధి. అవి శివలింగంపై పడటంతో అతనికి పుణ్యం లభించిందని పురాణాలు చెబుతాయి. ఈ కథ ద్వారా భక్తి శక్తి ఎంత గొప్పదో తెలియజేస్తారునిష్కపటమైన భక్తి ఉంటే శివకృప తప్పక లభిస్తుందని సందేశం.

**ప్రసిద్ధ క్షేత్రాల్లో భక్తుల సందడి**

దేశవ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి సందర్భంగా అపారమైన భక్తజనం దర్శనమిస్తారు. ముఖ్యంగాకాశీ విశ్వనాథ దేవాలయం
శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానం
వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం
వంటి క్షేత్రాల్లో లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ప్రత్యేక దర్శనాలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడుతాయి.

**సామాజిక సందేశం సమానత్వానికి ప్రతీక**

మహాశివరాత్రి కేవలం ఆధ్యాత్మిక పర్వదినం మాత్రమే కాదు. ఇది సమాజానికి సానుకూల మార్పు సందేశాన్ని అందించే సందర్భం. అహంకారాన్ని విడిచిపెట్టి, సత్యంధర్మం మార్గంలో నడవాలని శివతత్వం సూచిస్తుంది. ప్రకృతితో మమేకమై సాదాసీదా జీవనం గడపడం శివుని జీవనశైలిలోని గొప్ప పాఠం.

**యువతకు ప్రేరణ**

యోగేశ్వరుడైన శివుడు నియమ నిష్ఠలకు, ధ్యానానికి ప్రతీక. అనవసర కోరికలను నియంత్రించి, ఆత్మపరిశీలన చేయాలని యువతకు ఈ పర్వదినం సందేశం ఇస్తుంది. కుటుంబ సమగ్రతకు, దాంపత్య సౌఖ్యానికి శివపార్వతుల

**ఆదర్శ జీవితం మార్గదర్శకం.**

మహాశివరాత్రి అనేది భక్తి, నియమ నిష్ఠల సమ్మేళనం. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానవెలుగులు నింపే మహా రాత్రి. ఉపవాసం, జాగరణ, శివనామ స్మరణ ద్వారా ఆత్మశాంతిని పొందే పవిత్ర సందర్భం.
శివకృపతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని మనసారా కోరుకుందాం.

సీనియర్ జర్నలిస్ట్
కొట్టే సుధాకర్
లెనిన్
9908401581



# పర్వతగిరి గురుకుల పాఠశాలలో ఘనంగా తల్లిదండ్రుల సమావేశం



**పర్వతగిరి/ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రంలోని పీఎం శ్రీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో శనివారం సెకండ్ సాటర్డే హాస్టల్ విజిటింగ్‌లో భాగంగా ప్రిన్సిపాల్ పి. అపర్ణ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అపర్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఆంగ్ల విద్య, యోగా, కరాటే, క్రీడలు, వసతి సౌకర్యాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. పీఎం శ్రీ పథకం కింద పాఠశాలకు 50,000 రూపాయల విలువైన క్రీడా సామాగ్రి (స్పోర్ట్స్ మెటీరియల్) మంజూరైనట్లు ఈ సందర్భంగా ఆమె కమిటీకి వివరించారు.వైస్ ప్రిన్సిపాల్స్ జోష్నా, స్వాతి మాట్లాడుతూ.. విద్యార్థినులకు నిరంతరం అందుబాటులో ఉంటూ నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ ఐలపాక స్వప్న మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు.మాజీ వైస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలకు గురుకుల విద్యా వ్యవస్థ ఒక వరం లాంటిదని, కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న ఈ సంస్థలో చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందంతో పాటు పేరెంట్స్ కమిటీ సభ్యులు మాదాసి కృష్ణ, జన్ను కుమారస్వామి, పసునూరి భాస్కర్, మేకరి మల్కార్జున్, మూజ్జిగ అనిల్, ఆరూరి అశోక్, బిర్రు కరుణాకర్, మహంకాళి యాదగిరి, నరకుడు స్వప్న, రవీందర్, చిర్ర యాకోబు, యాకయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్లూగర్ రంగంపేట్ శివాలయంలో ఆధ్యాత్మిక శోభ
### ఆలయానికి గోముఖం వితరణ



**సంగెం/ఫిబ్రవరి 14(జర్నలిస్ట్ వార్త):**
సంగెం మండలంలోని ఎల్లూగర్ రంగంపేట్ గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ శివాలయం శనివారం ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించింది. శివభక్తిని చాటుకుంటూ గ్రామ నివాసి ముజ్జిగ రాధిక అనిల్ రావు గారు ఆలయానికి పవిత్రమైన గోముఖాన్ని బహూకరించారు. ఆలయ అర్చకుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో ఈ గోముఖాన్ని శివలింగ సన్నిధిలో సమర్పించారు.
ఈ కార్యక్రమానికి హాజరైన గ్రామ సర్పంచ్ బెజ్జంకి శేషాద్రి మాట్లాడుతూ, శివాలయానికి గోముఖాన్ని వితరణ చేయడం అత్యంత పుణ్యకార్యమని కొనియాడారు. ఆలయం గ్రామ ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందాలని, భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. శివుని సేవలో తరించడం వల్ల గ్రామానికి శుభం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.శివసేవే జీవసేవ అనే నినాదంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చివరగా హర హర మహాదేవ, శంభో శంకర స్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఉపసర్పంచ్ పెద్దగోని శ్వేత నరేశ్, మాజీ సర్పంచ్లు షాబోతు శ్రీనివాస్, జనగాం రమేశ్. మాజీ ఎంపీటీసీ జనగాం పద్మ శ్రీనివాస్, 6వ వార్డు మెంబర్ షాబోతు రంజిత్.ప్రముఖులు: బందెల రమేశ్ బాబు, నంద్యాల సతీష్, మడ్డి చేరాలు. ఆశ వర్కర్ గడ్డం కళ్యాణి, బోనాల స్వప్న, షాబోతు స్వరూప, వల్లేపు సులోచన, ఎరబాక స్వప్న.
గ్రామ సిబ్బంది భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, భక్తులుఈ పవిత్ర కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రముఖులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో నల్లబెల్లి మెరుపులు
### మండల స్థాయిలో దుర్గాప్రసాద్‌కు ప్రథమ స్థానం
**ప్రతిభ చాటిన రామ్ చరణ్, పవనసుత -విజేతలకు ఎంఈఓ శ్రీధర్ అభినందనలు**



**వర్ధన్నపేట, ఫిబ్రవరి14 (జర్నలిస్ట్ వార్త):**
నేటి బాలలే రేపటి భావి భారత శాస్త్రవేత్తలని, విద్యార్థులు వైజ్ఞానిక రంగంపై పట్టు సాధించి దేశ సేవలో భాగస్వాములు కావాలని మండల విద్యాధికారి ఎం. శ్రీధర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి భౌతిక శాస్త్ర టాలెంట్ టెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ మేధస్సుకు పదును పెట్టారు. మండల స్థాయి లో జరిగిన ఈ పోటీల్లో జడ్పీహెచ్ఎస్ నల్లబెల్లి విద్యార్థి దుర్గాప్రసాద్ అసాధారణ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. జడ్పీహెచ్ఎస్ ల్యాబర్తి విద్యార్థి బొల్లం రామ్ చరణ్, జడ్పీహెచ్ఎస్ వర్ధన్నపేట విద్యార్థి పవనసుత కుమార్లు ద్వితీయ స్థానంలో నిలిచి సత్తా చాటారు. విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలని సూచించారు. జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ఉన్నత చదువులు చదివి, నూతన ఆవిష్కరణలతో దేశ కీర్తిని దశదిశలా చాటాలన్నారు. భారతదేశానికి యువశక్తే అతిపెద్ద వరమని ఆయన కొనియాడారు. స్థానిక ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు త్వరలో జరగనున్న జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని వెల్లడించారు. జిల్లా స్థాయిలోనూ రాణించి మండలానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర జిల్లా బాధ్యులు కొండ్లె వేణు కుమార్, ఉపాధ్యాయులు పి.రమణారావు, కళ్యాణి, సంపత్ కుమార్, విజయ్, వర్ధిని తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# అక్షర దేవాలయాలు.. ప్రగతి నిలయాలు

## మార్కుల వేట కాదు.. మనిషిని తీర్చిదిద్దే బాట -నేటి పోటీ ప్రపంచంలో కార్పొరేట్‌కు దీటుగా గురుకులాలు

విద్య అంటే కేవలం అక్షర జ్ఞానం కాదు అది ఒక సంస్కారం. విద్యార్థిని పరిపూర్ణ మానవుడిగా తీర్చిదిద్ది, సమాజానికి ఒక బాధ్యతాయుతమైన పౌరుడిని అందించే అద్భుత వేదికలే మన గురుకులాలు కాలం మారుతున్నా, సాంకేతికత ఎంత పుంతలు తొక్కుతున్నా. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంలో గురుకులాలు నేటికీ అగ్రగామిగా నిలుస్తున్నాయి. జ్ఞాన సంపదకు నిలయాలుగా, పేద - మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుకు వారధులుగా ఇవి విరాజిల్లుతున్నాయి.



### విలువల వికాసం.. క్రమశిక్షణే పునాది

ఆధునిక విద్యావ్యవస్థలో మార్కుల వేటలో పడి విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్న తరుణంలో, గురుకులాలు వారికి జీవన నైపుణ్యాలను నేర్పిస్తున్నాయి. ఇక్కడ విద్య కేవలం తరగతి గదులకే పరిమితం కాదు. సూర్యోదయానికి ముందే నిద్రలేవడం నుండి రాత్రి పడుకునే వరకు ఒక క్రమశిక్షణాయుతమైన జీవనశైలి ఇక్కడ అలవడుతుంది గురువులే మార్గదర్శకులు ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పే బోధకులుగా కాకుండా, విద్యార్థుల ప్రతి కదలికను గమనిస్తూ వారిని సరైన మార్గంలో నడిపించే మెంటార్లుగా వ్యవహరిస్తారు. కులమతాలకు, పేద ధనిక వర్గాలకు అతీతంగా అందరూ ఒకే చోట కలిసి భోజనం చేయడం, కలిసి చదువుకోవడం వల్ల విద్యార్థుల్లో సహోదర భావం, సామాజిక స్పృహ బలపడుతున్నాయి.

### కార్పొరేట్ కు ధీ ట్టగా ఫలితాలు

ఒకప్పుడు గురుకులాలు అంటే కేవలం పేద విద్యార్థులకే పరిమితం అనే భావన ఉండేది. కానీ నేడు సీన్ మారింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలు కార్పొరేట్ విద్యా సంస్థలకు గట్టి పోటీనిస్తున్నాయి. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన జేఈఈ, ఎన్ ఈ ట, సి ఎల్ ఎ టీ, వంటి పోటీ పరీక్షల్లో గురుకుల విద్యార్థులు సత్తా చాటుతుండటం గమనార్హం. కేవలం పుస్తకాల్లోని జ్ఞానమే కాకుండా క్రీడలు, యోగా, సంగీతం వంటి సృజనాత్మక రంగాల్లోనూ శిక్షణ ఇస్తూ విద్యార్థుల బహుముఖ ప్రజ్ఞకు ఇవి మెరుగులు దిద్దుతున్నాయి.

### ఆధునిక హంగులు..

జ్ఞాన సంపదకు నిలయాలుగా ఉన్న ఈ సంస్థలు మరింత శక్తిమంతంగా మారాలంటే కొన్ని సవాళ్లను అధిగమించాల్సి ఉంది. ప్రస్తుత గ్లోబల్ పోటీని తట్టుకోవాలంటే ప్రతి గురుకులంలో డిజిటల్ తరగతులు, హై-టెక్ కంప్యూటర్ ల్యాబ్‌లు అందుబాటులోకి రావాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతి గృహాలను, అత్యాధునిక ప్రయోగశాలలను పెంచాల్సిన అవసరం ఉంది.

### రేపటి తరానికి దిక్సూచి

విద్య అంటే సమాచారాన్ని మెదడులో నింపడం కాదు.. అది శీలాన్ని నిర్మించాలి, మానసిక బలాన్ని పెంచాలి" అన్న వివేకానందుడి మాటలకు గురుకులాలు నిలువుటద్దాలు. రాష్ట్ర, దేశ ప్రగతిలో ఈ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అక్షర దేవాలయాలుగా పిలవబడే ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా మనం రేపటి తరాన్ని జ్ఞానవంతులుగా, బాధ్యతాయుతమైన పౌరులుగా మార్చవచ్చు.



జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్

# సత్యంకోసం కలం- సమాజంకోసం ప్రెస్ క్లబ్

## నేలకొండపల్లిలో భక్త రామదాసు ప్రెస్ క్లబ్ ఘన ఆవిర్భావం

**నేలకొండపల్లి/ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):** పాత్రికేయుల ఐక్యతకు నాంది పలుకుతూ, ప్రజా సమస్యలకు ప్రతిధ్వనిగా నిలిచే వేదికగా భక్త రామదాసు ప్రెస్ క్లబ్ శనివారం నేలకొండపల్లిలో ఆవిర్భవించింది. స్థానిక పాత్రికేయుల సమిష్టి కృషితో ఏర్పాటైన ఈ వేదిక మీడియా రంగానికి నూతన ఉత్సాహాన్ని నింపింది.

ఈ కార్యక్రమానికి రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రతినిధిగా ఆయన శిబిర కార్యాలయ ఇంచార్జ్ బీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రెస్ క్లబ్‌ను ఆవిష్కరించారు. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నెపూసల సీతరాములు, మేజర్ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యలకు ప్రతిధ్వని కావాలి: బీమిరెడ్డి**

బీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రెస్ క్లబ్ అనేది కేవలం భవనం కాదుడ అది ఆలోచనల ఆవాసం. ప్రజా సమస్యలకు ప్రతిధ్వని కావాలి" అని పేర్కొన్నారు. మంత్రి బిజీ కార్యక్రమాల వల్ల హాజరు కాలేకపోయారని, తనను



ప్రతినిధిగా పంపినట్లు తెలిపారు. ప్రెస్ క్లబ్ ఏర్పాటుతో స్థానిక సమస్యలు స్పష్టంగా వెలుగులోకి వస్తాయని, అధికారులు ప్రజాప్రతినిధులు బాధ్యతగా స్పందించే వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సత్యాన్వేషణే లక్ష్యం: తహసీల్దార్**

తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాత్రికేయులు నైతిక విలువలను కాపాడుతూ సత్యాన్వేషణలో ముందుండాలని సూచించారు. "సత్యం కోసం కలండ సమాజం కోసం ప్రెస్ క్లబ్" అనే నినాదం కార్యరూపం దాల్చాలని ఆకాంక్షించారు.

### ఐక్యతకు ప్రతీక

వెన్నెపూసల సీతరాములు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ ఆవిర్భావం జర్నలిస్టుల ఐక్యతకు ప్రతీకగా నిలవాలని, ప్రజా ప్రయోజనాల కోసం పోరాటానికి నూతన దిశగా మారాలని అన్నారు. నైతిక విలువలతో కూడిన పాత్రికేయ వ్యవస్థ అభివృద్ధికి ఈ వేదిక కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దినేని మహేష్, కొత్తకొత్తూరు ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, రెవిన్యూ పరిశీలకుడు మధు, అటవీ అధికారి డానియేలు, గుగ్గిళ్ల దివ్యమూర్తి, కొమ్మూరి నరేష్, దోసపాటి రామదాసు, పసుపులేటి ఉపేందర్, బట్టపోతుల ప్రకాశం, బొడ్డు బాబురావు తదితర రాజకీయ, సామాజిక ప్రముఖులు పాల్గొన్నారు.

# స్పా సెంటర్ ముసుగులో వ్యవభిచారం

## పోలీసుల మెరుపు దాడిలో 45మంది అరెస్ట్

**హైదరాబాద్‌/ఫిబ్రవరి 14 (జర్నలిస్ట్ వార్త):** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ పరిధిలో స్పా సెంటర్ల పేరుతో సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని గాయత్రి రెసిడెన్సీలో ఉన్న 'ఆసన వెల్నెస్ స్పా' సెంటర్‌లో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం జరుగుతుందన్న పక్కా సమాచారంతో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పోలీసులు మొత్తం 15 మంది యువతులను, 30 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు నిర్వాహకులు కాగా, మిగిలిన 27 మందిని విటులుగా గుర్తించి అందరిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల విచారణలో ఈ దందాకు సంబంధించిన షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇర్ఫాన్ అనే వ్యక్తి గత ఏడాది కాలంగా ఈ స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఫుల్ బాడీ మసాజ్, అరోమా మసాజ్ వంటి పేర్లతో కస్టమర్లను ఆకర్షించి, లోపల నిబంధనలకు విరుద్ధంగా క్రాస్ మసాజ్ , వ్యభిచార కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తేలింది. ఈ ముఠాకు కూకట్‌పల్లి 9వ ఫేజ్‌లో కూడా మరో బ్రాంచ్ ఉన్నట్లు సమాచారం అందడంతో, పోలీసులు ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఈ రైడ్ సందర్భంగా నిందితుల నుంచి పోలీసులు 45 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్పా సెంటర్ల ముసుగులో ఇలాంటి అసాంఘిక పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పట్టుబడ్డ యువతులను రెస్క్యూ హోమ్‌కు తరలించగా, నిర్వాహకులు , విటులపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. నగరంలో ఇలాంటి అక్రమ సెంటర్ల జాబితాను తయారు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు.

# ప్రశ్నిస్తే రక్తం చిందించాల్సిందేనా?

## కొట్టింది ఎమ్మెల్యేనా? అనుచరులా? -వర్ధన్నపేటలో ప్రజాస్వామ్యంపై సర్జికల్ స్ట్రైక్

### గెలుపు కిడ్నాప్.. బంజారా యువకులపై బడబాగ్ని -రక్తసిక్తమైన జాతీయ రహదారి.. యుద్ధభూమిగా మారిన వరంగల్-ఖమ్మం హైవే



**వర్ధన్నపేట/ఫిబ్రవరి14 (జర్నలిస్ట్ వార్త):** ప్రజాస్వామ్యంలో ఓటు ఒక ఆయుధం.. కానీ వర్ధన్నపేటలో అది ఆ అభ్యర్థికి శాపమైంది. ప్రజలు నమ్మి ఓటేసి గెలిపిస్తే, ఆ గెలుపును అధికారం కాజేయాలని చూస్తోంది. వర్ధన్నపేట మున్సిపాలిటీ 5వ వార్డు స్వతంత్ర అభ్యర్థి శిభారాణి రాజేందర్ కిడ్నాప్ ఉదంతం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటన కేవలం ఒక అభ్యర్థి అదృశ్యం కాదు.. సామాన్యుడి తీర్పుపై జరిగిన సర్జికల్ స్ట్రైక్‌గా స్థానికులు అభివర్ణిస్తున్నారు. తమ నాయకురాలు కన్పించకుండా పోవడంతో ఆందోళన వ్యక్తం చేసిన బంజారా యువకులపై విచక్షణారహితంగా దాడులు జరగడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. శుక్రవారం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై యుద్ధ వాతావరణం నెలకొంది. ఒంటినిండా రక్తపు గాయాలు, చొక్కాలు చిరిగిన స్థితిలో యువకులు రోడ్డుపై బైఠాయించి చేసిన నిరసన.. పాలకుల అణచివేత ధోరణికి సాక్ష్యంగా నిలిచింది. మమ్మల్ని కుక్కలను కొట్టినట్టు కొట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా గెలిస్తే కిడ్నాప్ చేస్తారా? అని అడిగినందుకే మాపై దాడి చేశారని బాధితులు రక్తం ఓడుతున్న గాయాలతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ దాడులు చేయించింది ఎమ్మెల్యేనా లేక ఆయన



కనుసన్నల్లో మెలిగే అనుచరులా? అని బాధితులు ప్రశ్నిస్తుంటే దానికి సమాధానం చెప్పే నాథుడే కరువయ్యారు. మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవడానికి కావాల్సిన బలం లేకపోవడంతో, స్వతంత్రులను లొంగదీసుకోవడానికి సామ దాన భేద దండోపాయాలను ప్రయోగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శిభారాణిని బలవంతంగా తీసుకెళ్లడం వెనుక అధికార పార్టీకి చెందిన కీలక నేతల హస్తం ఉందనేది బహిరంగ రహస్యం. గెలిచిన అభ్యర్థిని సొంతం చేసుకుంటే సరిపోతుందా? ఆమెకు ఓటేసిన ప్రజల నమ్మకాన్ని ఏం చేస్తారు? గిరిజన యువకులపై దాడులు చేయడం ఏ రకమైన రాజకీయం? నియోజకవర్గ తండ్రిగా ఉండాల్సిన ఎమ్మెల్యే, తన అనుచరులు దాడులు చేస్తుంటే ఎందుకు నియంత్రించలేదు? లేక ఈ



దాడులన్నీ ఆయన కనుసన్నల్లోనే జరిగాయా? గెలిచిన అభ్యర్థి ప్రాణాలకు ఏమైనా జరిగితే ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా? వర్ధన్నపేటలో జరిగిన ఈ ఘటన ప్రజాస్వామ్య విలువలకు మాయని మచ్చ. దాడులకు పాల్పడిన నిందితులను, వారు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే, బంజారా తండా ప్రజల ప్రతాపం ఏంటో సమయానుకూలంగా సమాధానం చెప్తామని బాధితులు హెచ్చరిస్తున్నారు.





